# గుజరాత్ : ఆందోళనా పథంలో ఫోర్డు కార్మికులు

**2019** జూన్ 19వ తేదీని గుజరాత్ రాష్ట్రం-సనంద్‌లోని ఫోర్డు కంపెనీలో పనిచేసే కార్మికుడిని విధులనుండి తొలగించారు. గత సంవత్సరం 'ఫోర్డు ఇండియా' కార్మికులు 'కర్మావతి కామ్‌దార్ ఏక్‌తా సంఘ్'(కెకెఇఎస్) అనే పేరిట ఓ సంస్థను ఏర్పరచుకున్నారు. తమ కార్మికుల డిమాండ్ల వరకే పరిమితమై ఈ సంస్థ పనిచేస్తుంది. ఇందులో 900 మంది సభ్యు లున్నారు. ప్రస్తుతం తొలగించబడిన కార్మికుడు ఈ సంస్థలో సభ్యుడిగా వున్నాడు. తనను తొలగించటానికి ఏవిధమైన చట్టబద్ధమైన సాక్ష్యాలు లేవని ఆ కార్మికుడు చెబుతున్నాడు.

కాగా జూన్ 21వ తేదీన కార్మికుని తొలగింపును నిరసిస్తూ వేలాది మంది కార్మికులు తరలివచ్చి నిరవధిక సమ్మె చేపట్టారు. తొలగించిన కార్మికుడిని తక్షణం విధులలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జూన్ 21 నుండి 27వ తేదీ వరకు 900 మంది కార్మికులు విధులు బహిష్కరించారు.

1. కెకెఇయస్ సంస్థాగత కార్మికుల పట్ల కంపెనీ యాజమాన్యపు కుట్రపూరిత చర్యలు మానుకోవాలని, తొలగించిన కార్మికుని వెంటనే చేర్చుకోవాలని వారంతా ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. 2. ఫోర్డు మోటార్స్ యాజమాన్యం విధులకు గైర్హాజరైన రోజులకు కూడా పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యమంయొక్క ఒత్తిడి ఫలితంగా చివరకి ఫోర్డు యాజమాన్యం ఈ కేసును పారిశ్రామిక ట్రిబ్యునల్‌కు పంపింది. 'ఈ ముహూర్త్' కరస్పాండెంట్‌తో కెకెఇఎస్ సభ్యులొకరు మాట్లాడుతూ తొలగించిన కార్మికుని తిరిగి తీసుకోవటం తమ ప్రథమ డిమాండ్ అని, విధులు బహిష్కరించిన కాలానికి కార్మికు లందరికీ పూర్తి వేతనాలు చెల్లించాలనేది తమ ద్వితీయ ప్రాధాన్య డిమాండ్‌గా పేర్కొన్నాడు. ఫోర్డు మోటార్స్ యాజమాన్యం తొలగించిన కార్మికుని తిరిగి తీసుకోనట్లయితే, ఈ సంస్థలోని మిగిలిన సభ్యులంతా మరోసారి విధులు బహిష్కరించటానికి సిద్ధంగా వున్నారు.

ఈ డిమాండ్‌పై పోరాడుతున్న కార్మికులు నిరాహారదీక్షలు చేపట్టారు. తమ వేతనాల పెంపును వారు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి నెలలో యాజమాన్యం తమకు అందించే ఆహారం, పానీయాలను 3 నెలలపాటు సామూహికంగా బహిష్కరించారు. ఆటోమొబైల్ పరిశ్రమలో పనిచేసే కార్మికుల సగటు వేతనంకంటే సనంద్‌లో పనిచేసే కార్మికులు తక్కువ పొందుతున్నారు. (సగటున నెలసరి ఆదాయం దాదాపు పదివేల రూ॥మాత్రమే) వీరిలో కొందరికి 9-10 సం॥ల పని అనుభవం కూడా వుంది. అయితే వేతనాలు ఆ స్థాయిలో పెరగటంలేదు. మరోవైపున చెన్నై ఫోర్డు కార్మికుల అదేపనిచేస్తున్న గుజరాత్ కార్మికుల కంటే అధిక వేతనం పొందుతున్నారు. తమలో ప్రోదిపడిన ఈ చైతన్యాన్ని నిరోధించి, నాశనం గావించేందుకు ఫోర్డు యాజమాన్యం చేస్తున్న కుట్రలను కార్మికులు తీవ్రంగా నిరసించారు.

ooo